క్లుప్తంగా

23న మెగా జాబ్‌మేళా

మునగపాక: ఈ నెల 23న మండలంలోని తిమ్మరాజుపేట డావెన్సీ అంతర్జాతీయ పాఠశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి గోవిందరావు మాట్లాడుతూ పది, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ వరకు చదువుకున్న యువతీ, యువకులు ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9492429425 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

శ్రీగంగాలమ్మ తల్లి గుడికి విరాళం



గంగాలమ్మ తల్లి గుడికి విరాళం అందజేస్తున్న భక్తుడు పవన్‌కుమార్

మునగపాక: పాటిపల్లి–మంగళవరపుపేట పరిధిలో నిర్మిస్తున్న శ్రీగంగాలమ్మ తల్లి ఆలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు ఆలయ నిర్మాణానికి తమవంతు సాయం అందజేస్తున్నారు. బుధవారం యల్లపు నాగేశ్వరరావు, అప్పల కొండ దంపతుల కుమారుడు పవన్‌కుమార్ రూ.20,116 నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులకు సామగ్రి అందిస్తున్న యువజన మందిరం క్రీడా విభాగం కన్వీనర్ విజయ్

మునగపాక: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని గ్రామీణ యువజన మందిరం క్రీడా విభాగం కన్వీనర్ పెంటకోట విజయ్ కోరారు. బుధవారం తన సొంత నిధులతో కొనుగోలు చేసిన వాలీబాల్ కిట్, బేస్‌బాల్, స్కిప్పింగ్ రూప్స్, హ్యాండ్ రింగ్స్, బాస్కెట్ బాల్ తదితర స్పోర్ట్స్ కిట్లను బుధవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు, హెచ్ఎం శ్రీనివాసరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తిమ్మరాజుపేట అభివృద్ధికి సహకరించాలి



తిమ్మరాజుపేటలో మట్టి దిబ్బల తొలగింపు పనులను పరిశీలిస్తున్న జగన్, వెంకటేష్

మునగపాక: ప్రతి ఒక్కరూ తిమ్మరాజుపేట గ్రామాభివృద్ధికి సహకరించాలని ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ కోరారు. మండలంలోని తిమ్మరాజుపేటలో జరుగుతున్న మట్టి దిబ్బలు, చెత్త తొలగింపు పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్ భీశెట్టి మంగలక్ష్మి ఇతర పాలకవర్గ సభ్యులంతా గ్రామంలోని సమస్యలపై దృష్టి సారిస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు కూడా గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంచాల పంపిణీ



విద్యార్థులకు కంచాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి: మండలంలో డీఎల్ పురం మోడల్ పాఠశాలలో విద్యార్థులకు ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు తమ సొంత ఖర్చులతో కంచాలు అందజేశారు. 80 మంది విద్యార్థులకు భోజనాలు చేయడానికి అవసరమైన ప్లేట్లు కొనుగోలు చేసి అందజేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ నానాజీ, ఉపాధ్యాయులు మాడెం సత్యనారాయణ, సతీష్, మంగరత్నం, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనం 'చెత్త'పాలు..!



నిరుపయోగంగా మారిన డస్ట్‌బిన్లు



మున్సిపాల్టీ గ్యారేజీలో మూలకు చేరిన డస్ట్‌బిన్లు

- మూలన పడిన డస్ట్‌బిన్లు
- రూ.20 లక్షలు వృథా

యలమంచిలి రూరల్: ఎక్కడైనా తుప్పుపట్టిన డస్ట్‌బిన్లను మూలన పడేస్తారు. కానీ యలమంచిలి మున్సిపాలిటీ అధికారుల తీరే వేరు. ఏకంగా కొత్తగా కొనుగోలు చేసిన స్టెయిన్‌లెస్ స్టీల్ డస్ట్‌బిన్లు పాడవకుండానే గ్యారేజీలో పడేశారు. మన సొమ్ము కాదులే అన్న నిర్లక్ష్యంతో లక్షలాది రూపాయల ప్రజాధనంతో కొనుగోలు చేసిన డస్ట్‌బిన్లు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. యలమంచిలి పురపాలక సంఘం పరిధిలో 25 వార్డుల్లో 10 సచివాలయాల పరిధిలో చెత్త వేయడానికి వీలుగా 62 ట్విన్ బిన్లు కొనుగోలు చేశారు. ఏడాదిన్నర క్రితం సుమారు రూ.20 లక్షలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన వీటిని పట్టణంతో పాటు జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, విలీన గ్రామాల్లో ఏర్పాటు చేశారు. వీటిలో వేసిన చెత్తను పారిశుధ్య కార్మికులు వాహనాలపై డంపింగ్ యార్డుకు తరలించేవారు. అయితే వీటి వల్ల ఆశించిన ప్రయోజనం దక్కకపోవడంతో చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. వీటిలో ఎక్కువ చెత్త పట్టకపోవడం, వేసిన చెత్త కింద పడిపోవడం, ఆ ప్రాంతాల్లో దుర్వాసన రావడం, పందులు, కుక్కలు సంచరించడం వంటి కారణాలతో చాలా వరకు వీటి వినియోగం తగ్గింది. పైగా ట్విన్ బిన్లను ముందస్తు కసరత్తు చేయకుండా అవసరం లేని చోట ఏర్పాటు చేశారు. దీంతో ఇవి ప్రజలకు ఉపయోగపడలేదు. ఫలితంగా స్వల్ప కాలంలోనే ఉత్సవ విగ్రహాల్లా మారాయి. నిరుపయోగంగా మారిన బిన్లను మున్సిపాలిటీ గ్యారేజీలో మూలన పడేశారు. ఇవన్నీ క్రమంగా తుప్పుపట్టిపోతున్నాయి. మరికొన్ని చోట్ల బిన్లలో కాకుండా వాటి పక్కన చెత్త వేస్తున్నారు. ఇవి చెత్త వేయడానికి వీలుగా లేవన్నది కొందరి ప్రజల వాదన. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ ఇంజినీర్ అనాలోచిత నిర్ణయంతోనే వీటిని కొనుగోలు చేసినట్టు తెలిసింది. అయితే కొనుగోలు చేసిన బిన్లను సక్రమంగా ఉపయోగించే పరిస్థితి లేకపోవడంతో వాటి కొనుగోలుకు వెచ్చించిన విలువైన ప్రజాధనం వృథా అయినట్టేనని కొందరు పౌరులు విమర్శిస్తున్నారు. ప్రజల నుంచి వివిధ పన్నుల రూపంలో వసూలు చేస్తున్న నిధుల ఖర్చు విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కమర్షియల్ ప్రాంతాల్లో షాపుల ముందు డస్ట్ బిన్లు ఏర్పాటు చేశామని, దీని వలన అక్కడ చెత్త తరలింపు సులభంగా జరుగుతోందని అధికారులు చెబుతున్నారు. చాలా పట్టణాలు, నగరాల్లో చెత్త డబ్బాలకు బైబై చెబుతున్నారు. అంతేకాకుండా క్లీన్ ఏపీలో భాగంగా పట్టణాన్ని డస్ట్‌బిన్ రహితంగా చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రజాధనంతో కొనుగోలు చేసిన ట్విన్‌బిన్ల కథ కంచికి చేరినట్టే.

అవసరమైన చోట ఉపయోగిస్తాం



నేను ఇక్కడకు కమిషనర్‌గా రాకముందే ట్విన్‌బిన్లను కొనుగోలు చేశారు. ప్రస్తుతం చాలా చోట్ల ఇవి నిరుపయోగంగా మారిన సంగతి వాస్తవమే. నిరుపయోగంగా మారిన బిన్లను గ్యారేజీలో ఉంచాం. ఎక్కడైనా అవసరమైతే వాటిని వినియోగిస్తాం. వాటిపై పెట్టిన ఖర్చు వృథా కాకుండా చర్యలు తీసుకుంటాం.

– బీజేఎస్ ప్రసాదరాజు,
యలమంచిలి మున్సిపల్ కమిషనర్

లగోరి పోటీల్లో డీపాల్ విద్యార్థుల ప్రతిభ



లగోరి పోటీల్లో రాణించిన విద్యార్థులను అభినందిస్తున్న డీపాల్ యాజమాన్యం

అచ్యుతాపురం: ఏడు పెంకులాట(లగోరి) పోటీల్లో స్థానిక డీపాల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ మేరకు బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ మెర్లిన్, వైస్ ప్రిన్సిపాల్ లిబిన్ థామస్ విద్యార్థులను అభినందించారు. సంప్రదాయ ఆటైన ఏడు పెంకులు(లగోరి) రాష్ట్ర స్థాయి పోటీలను కడప జిల్లా మైదుకూరులో ఈ నెల 16 నుంచి 19 వరకూ నిర్వహించారు. లగోరి ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో అనకాపల్లి జిల్లా జట్టులో డీపాల్ విద్యార్థులు పాల్గొన్నారు. సీనియర్స్ విభాగంలో కడప జట్టుకు ప్రథమ స్థానం రాగా, అనకాపల్లి జట్టుకు ద్వితీయ స్థానం దక్కింది. ఈ మేరకు పీఈటీ అప్పారావు, చంద్రకళలను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పాయకరావుపేట: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో 2025–26 సంవత్సరంలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో ప్రభుత్వ ఐటీఐకు వచ్చి రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు గడువు ఈ నెల 26వ తేదీ కాగా.. సర్టిఫికెట్ వెరిఫికేషన్ గడువు ఈనెల 27వ తేదీ అని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, కుల, ఆదాయ ధ్రువ పత్రాలతో పాటు పాస్ ఫోటో, ఈమెయిల్ ఐడీ, ఆధార్ లింక్ ఫోన్ నెంబరు, ఆధార్ కార్డ్‌తో ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలన్నారు.

అవెరెక్స్ అనుమతులు రద్దు చేయాలి



అవెరెక్స్ గేటు వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేతలు

అచ్యుతాపురం: అచ్యుతాపురం సెజ్‌లోని అవెరెక్స్ డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనుమతులు శాశ్వతంగా రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం అవెరెక్స్ గేటు వద్ద సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఆర్ఐ దాడుల్లో భాగంగా ఈ కంపెనీలో మత్తు మందును నిబంధనలకు విరుద్ధంగా తయారు చేస్తున్నారని, యాజమాన్యం తమకు ఏ మాత్రం సంబంధం లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బయటకు వచ్చిన ఇటువంటి ఉదంతాలకు తోడు ఫార్మా కంపెనీల్లో జరుగుతున్న పలు అవకతవకలపై దాడులు జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు కొరుప్రోలులో రీసర్వే

ఎస్.రాయవరం: కొరుప్రోలు రెవెన్యూ పరిధిలోని భూముల రీసర్వేకు తహసీల్దార్ జె.రమేష్‌బాబు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం నిర్వహించనున్నారని వీఆర్‌వో రాంబాబు తెలిపారు. రీసర్వే పూర్తయితే దీర్ఘకాలిక భూసమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. ఈ సమావేశానికి అందుబాటులో ఉన్న రైతులు హాజరుకావాలని కోరారు.

దోమ కాటు ఎంతో ప్రమాదం



హరిపాలెం పీహెచ్‌సీ వద్ద దోమలను నివారిస్తామంటూ ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

అచ్యుతాపురం: పరిసరాల్లో దోమలు లేకుండా చూసుకోవాలని, దోమ కాటుతో అనేక వ్యాధులు సంక్రమిస్తాయని హరిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డి.రవిబాబు తెలిపారు. అచ్యుతాపురం మండలం హరిపాలెం పీహెచ్‌సీ వద్ద బుధవారం ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దోమల నివారణకు అందరూ కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వైద్యురాలు షకీనా మాట్లాడుతూ దోమ కాటుతో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. వారానికి ఒక రోజు డ్రైడే పాటించాలని సూచించారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్.శ్రీనివాస్, ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమా మహేశ్, వైద్య సిబ్బంది గణేశ్, లక్ష్మి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



సీతయ్యపేటలో నిరసనలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు

బుచ్చెయ్యపేట: సర్కార్ నిర్ణయం వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లను తక్షణం ప్రభుత్వం ఆదుకోవాలంటూ బుధవారం సీతయ్యపేట మూడు రోడ్ల జంక్షన్‌లో దుర్గాభవాని ఆటో యూనియన్ సంఘం ఆధ్వర్యంలో పలు గ్రామాల ఆటో డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లకు ఆదాయ మార్గాలు లేక పస్తులుంటున్నామన్నారు. వాహనమిత్ర ద్వారా ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ. 15 వేలు నగదు అందించాలని, ఆర్టీసీలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఆటో డ్రైవర్, మోటారు కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం, పెన్షన్ సదుపాయాలు కల్పించాలని అన్నారు. బ్యాంకుల నుంచి పావలా వడ్డీకి రుణాలు అందించాలని, గోతుల రోడ్లు బాగు చేసి ప్రయాణికులకు సుఖప్రయాణం కల్పించాలని కోరారు. ఆటో యూనియన్ సంఘం అధ్యక్ష,కార్యదర్శులు అక్కిరెడ్డి నరిశింగరావు,పిల్లా రాజు,ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు కోరుబిల్లి జగదీష్ పాల్గొన్నారు.

నేడు దొండపూడిలో దుర్గాలమ్మ పండగ

- రాష్ట్ర స్థాయి వాలీబాల్, మహిళా కబడ్డీ పోటీలు
- ఉత్తరాంధ్ర జిల్లాలు క్విజ్ పోటీల నిర్వహణ



రావికమతం : దొండపూడి గ్రామ ఆరాధ్య దైవం, దుర్గాలమ్మ అమ్మవారి పండగ గురువారం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించనున్నారు. పండగ సందర్భంగా రాష్ట్ర స్థాయి వాల్‌బాల్, మహిళల కబడ్డీ పోటీలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 30వేలు, రూ.20వేలు, రూ.10 వేలు అందజేయనున్నట్టు నిర్వాహకులు బుధవారం తెలిపారు. గ్రామస్తుల సహకారంతో అమ్మవారి ఆలయాన్ని ఈ నెల 14 వ తేదీన ప్రారంభించారు. కాగా గురువారం జరిగే పండగ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు ఈ జాతరకు హాజరవు తున్నారు.

క్వారీ లీజు రద్దు చేయాలి



మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ శివాజీకి వినతిపత్రం అందజేస్తున్న క్వారీ బాధితులు

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం, జి.కోడూరు రాయి క్వారీ లీజు రద్దు చేయాలని కోరుతూ గనులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శివాజీకి వినతిపత్రం అందజేశారు. అనుమతులు రద్దు చేయాలంటూ ఆర్డీవో కార్యాలయం వద్ద కొనసాగుతున్న నిరాహారదీక్షల్లో భాగంగా గురువారం పెదబొడ్డేపల్లి అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకుడు ఈరెల్లి చిరంజీవి, బీఎస్పీ రాష్ట్ర నాయకుడే బొట్టా నాగరాజు మాట్లాడుతూ 29 రోజుల నుంచి నిరాహార దీక్షలు చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు దళిత రైతుల ఆవేదన పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మైనింగ్ మాఫియాను అరికడతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక క్వారీ అనుమతులు మంజూరు చేయడం అన్యాయమన్నారు. వెంటనే క్వారీ అనుమతులు రద్దు చేయాలన్నారు.

వరి పొలాల్లో నిల్వ నీటిని తీసేయాలి



తుమ్మపాలలో అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావు

అనకాపల్లి: వరి నాట్లు వేసిన పొలాల్లో ఇటీవల వర్షాలకు నిలిచిపోయిన నీటిని రైతులు తీసివేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహన్‌రావు సూచించారు. మండలంలో తుమ్మపాల గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు తీసిన పొలాల్లో గ్రోమోర్ 28:28:0 లేదా 20:20:13 ఎరువును ఎకరాకు 30 నుంచి 40 కేజీలు వేసుకున్నట్లయితే వరిచేలు ఎదుగుదల బాగుంటుందన్నారు. రైతులు విధిగా డీఏపీ 50 కేజీలు వేసుకోవాలన్నారు. నారుమడులలో జింకులోపం నివారణకు జింక్ సల్ఫేట్ 5 శాతం ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారి రంగాచారి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ ఇంకా పడని రైతులు గ్రీవెన్స్‌లో వ్యవసాయ సహాయకురాలిని కలిసి అప్‌లోడ్ చేయించుకోవాలని కోరారు. రెండు, మూడు రోజుల్లో తుమ్మపాల రైతు సేవ కేంద్రానికి యూరియా వస్తుందని చెప్పారు.

ఏకాగ్రతతో చదివితేనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులతో మాట్లాడుతున్న సహాయ మోనిటరింగ్ అధికారి కృష్ణవేణి

మునగపాక: విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని మోడల్ స్కూళ్ల నిర్వహణ సహాయ మోనిటరింగ్ అధికారి కృష్ణవేణి అన్నారు. మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌ను బుధవారం ఆమె సందర్శించారు. విద్యార్థుల పుస్తకాలు, ఉపాధ్యాయుల రికార్డులు పరిశీలించారు. అనంతరం విద్యార్థుల కోసం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని రుచి చూశారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఇష్టపడి, కష్టపడి చదువుకుంటే మంచి ఫలితాలు సొంతమవుతాయన్నారు. ఉపాధ్యాయులు కూడా పిల్లల చదువుపై దృష్టి సారించాలన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'



పంటలను పరిశీలిస్తున్న అధికారులు

పాయకరావుపేట: మండలంలోని శ్రీరాంపురం, వెంకటనగరం గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ త్వరితగతిన ఈ పంట నమోదు పూర్తి చేయాలన్నారు. వరి పంట సమగ్ర సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రియాంక, కె.వీరబాబు, గ్రామ సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

పాస్టర్ అబ్రహాం కుటుంబానికి పరామర్శ



దండా అబ్రహాం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కంబాల జోగులు, నాయకులు

పాయకరావుపేట: పెదరాంభద్రపురం గ్రామంలో పాస్టర్ దండా అబ్రహాం ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త కంబాల జోగులు, పార్టీ నాయకులు బుధవారం పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు, జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, సర్పంచ్‌లు గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, పన్నీరు పాపారావు, గంపల మార్త సత్తిబాబు, చేపల నాగమణి తాతాజీ, ఎంపీటీసీ గారా వెంకటలక్ష్మీ చక్రవర్తి, తెరపల్లి చంటిబాబు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ఆందోళన



ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జీవిత బీమా ఏజెంట్లు

యలమంచిలి రూరల్: ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించడంతో పాటు పలు డిమాండ్ల అమలు కోసం జీవిత బీమా ఏజెంట్లు బుధవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. బీమా పాలసీపై జీఎస్టీ తగ్గించాలని, పాలసీదారులకు బోనస్ పెంచాలని, రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించాలని, ఏజెంట్లకు ఆరోగ్య బీమా వర్తింపజేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్‌ను రూ.25 లక్షలకు పెంచడంతో పాటు వయోపరిమితిని 69 నుంచి 85 సంవత్సరాలకు వర్తింపజేయాలని ఆందోళనలో పాల్గొన్న ఏజెంట్లు డిమాండ్ చేశారు. సంక్షేమ నిధి, పెన్షన్ హామీని అమల్లోకి తేవాలని కోరారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీమా ఏజెంట్ల సంఘం కార్యదర్శి టీవీవీ సత్యనారాయణ, ఆర్‌వీఎస్ఎన్ మూర్తి, కర్రి శ్రీను, ఎల్.అప్పలరాజు, బొడ్డేటి వెంకట్రావు, ఎస్.అప్పారావు, రామజోగి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు



సమావేశంలో మాట్లాడుతున్న జి.కోటేశ్వరరావు

అనకాపల్లి:గ్రామాల్లో పారిశుధ్య కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవడంలో విఫలమైందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఆరోపించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతుడి పారిశుద్య కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడంలేదని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు మేలు చేసే 551, 680, 132, తదితర ప్రభుత్వ జీవోలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇచ్చే అరకొర జీతాలు కూడా మూడు, నాలుగు నెలలకు ఒక్కొక్కసారి, ఐదు, ఆరు నెలలకి ఒకసారి ఇస్తున్నారని ధ్వజమెత్తారు. మద్యపానాన్ని నిషేధించి నిత్యావసర ధరలు తగ్గించాలని ఆయన కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కార్యవర్గ యూనియన్ గౌరవాధ్యక్షుడిగా ఆర్.శంకరరావు , జిల్లా అధ్యక్షుడిగా మొలకలపల్లి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శిగా ఆడారి నాగేశ్వరరావు, కోశాధికారిగా నక్క రవికుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దాకారపు శ్రీనివాసరావు, 23 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నాయిని బాబు, సోము నాయుడు, ఎస్. బ్రహ్మాజీ, దాకారపు శ్రీనివాసరావు, పరమేశ్వరరావు. చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

చోడవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 2025–26 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 నుంచి 26వ తేదీవరకు అడ్మిషన్లు ఆన్‌లైన్‌లో స్వీకరించడం జరుగుతుందన్నారు. బీఎస్సీలో కెమిస్ట్రీ–40, జువాలజీ–40, కంప్యూటర్ సైన్స్–40, ఫిజిక్స్, కంప్యూటర్‌సైన్స్–40సీట్లు ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా బీఏ విభాగంలో ఎకనామిక్స్- 60, బీకాం కంప్యూటర్స్–60 సీట్లు ఉన్నాయని తెలిపారు. మొత్తం 280 సీట్లు చోడవరం డిగ్రీ కాలేజీకి ఓఎఎండీసీ మంజూరు చేసిందన్నారు. విద్యార్థులు తమ ఒరిజినల్స్ సర్టిఫికెట్లతో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. వివరాలకు 8247470250, 9966545448 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.